www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 14 ఆగస్టు 2025



సామాన్య ప్రజలను ఆఫీసుల చుట్టూ తిప్పుకోవద్దు : మంత్రి

ప్రజాశక్తి-రాయచోటి

సామాన్య ప్రజలను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మంత్రి తన క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి తక్షణమే అక్కడికక్కడే అధికారులకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా నూతనంగా బాధ్యతల చేపట్టిన మున్సిపల్ కమిషనర్ రవి, పాలఏకిరి చైర్మన్ నాగేశ్వర్ నాయుడు, కొంతమంది నేతలు, ప్రజలు మంత్రికి గజమాలతో, పుష్పగుచ్ఛంతో సత్కరించి సన్మానించారు.



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి

ఉచిత బస్సుకు రైట్..రైట్..!

- రేపటి నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం
- జిల్లాలో 480 బస్సులు సిద్ధం
- 56,400 మహిళలకు లబ్ధి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో మహిళలకు ఇచ్చిన హామీ అమలుకు సిద్ధమైంది. స్త్రీశక్తి పథకం పేరుతో మార్గదర్శకాలను విడుదల చేసింది. ఆర్‌టిసిపై అదనపు ఆర్థిక భారం, మహిళా ప్రయాణికుల సంఖ్య, డ్రైవర్ల, కండక్టర్ల కొరత, రిక్రూట్‌మెంట్ తదితర అంశాలపై ఆర్‌టిసి ఉన్నతాధికారులు మేథోమధనం చేసింది. జిల్లాకు చెందిన ఆర్‌టిసి యంత్రాంగం శుక్రవారం నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రారంభోత్సవానికి మంత్రులు, ఆయా డిపోల పరిధిలోని ఎమ్మెల్యేలను ఆహ్వానించే పనిలో నిమగ్నమైంది. ఏడాదికాలంగా ఉచిత బస్సు పథకం అమలుపై చర్చలు నడుస్తుండడంతోపాటు అనేక భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో కథనం.



56,400 మంది మహిళలకు లబ్ధి

జిల్లాలో ప్రతిరోజూ 1.41 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. 40 శాతం మంది మహిళలు ప్రయాణిస్తున్నట్లు గుర్తించారు. ఉచిత బస్సు ప్రయాణం అమలు నేపథ్యంలో 56,400 మందికి చేరుకునే అవకాశం ఉందని గుర్తించారు. పెరగనున్న ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నేపథ్యంలో రూ.45 నష్టపోయే అవకాశం ఉన్నట్లు అంచనా. ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించిన అనంతరం మహిళా ప్రయాణికులు పెరిగే అవకాశం ఉంది. పెరిగి రూ.50 లక్షలకు భారం పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

480 ఆర్టీసీ బస్సులు సిద్ధం

జిల్లా పరిధిలో ఐదు డిపోలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 545 బస్సులు ఉండగా 480 బస్సులను స్త్రీ శక్తి పథకానికి ఏర్పాటు చేశారు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్ సర్వీస్‌లు కింద 480 బస్సులు ఏర్పాటు చేశారు. జిల్లాలో రాయచోటి, రాజంపేట, పీలేరు, మదనపల్లె-1, మదనపల్లె-2 పరిధిలో పల్లె వెలుగు 363, ఆల్ట్రా పల్లె వెలుగు 27, ఎక్స్‌ప్రెస్ 90 సర్వీసులు ఏర్పాటు చేశారు.

ఆధార్ తప్పనిసరి

ఆర్‌టిసి బస్సులలో ప్రయాణించే మహిళలు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆధార్ కార్డును తప్పనిసరిగాతమ ఆధార్ కార్డును చూపిస్తేనే జీరో టికెట్ జారీ చేస్తారు. ఆధార్ కార్డు లేకుంటే డబ్బులు చెల్లించి టికెట్ తీసుకోవాలి. స్త్రీ శక్తి పథకం పేరుతో జీరో టికెట్ను జారీ చేయనున్నారు. టికెట్ ఛార్జీ మొత్తాన్ని చూపిస్తూ దాన్ని ప్రభుత్వం రాయితీ ఇస్తున్నట్లు పేర్కొంటూ చెల్లించాల్సిన మొత్తాన్ని రూ.సున్నాగా వస్తుంది. ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేయవచ్చును. అయితే ఇప్పటివరకు ఆర్టీసీ బస్సులు సమయానికి అందుబాటులో లేకపోవడంతో ఆటోలలో ప్రయాణించే వారు. ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం స్వాతంత్ర్య దినోత్సవం రోజున అమలు చేయడంతో ఆటో కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత అమలు జరిగిన తర్వాత ఈ పథకం ఎలా అమలవుతుందో వేచి చూడాలి.

అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశాం



జిల్లాలో స్త్రీ శక్తి పథకాన్ని అమలు చేసేందుకు ఏర్పాట్లు అన్ని పూర్తి చేశాం. చిన్న పిల్లలకు, వృద్ధులకు, మహిళలకు, పురుషులకు ఎలాంటి బస్సు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. నూతన బస్సులు ఏర్పాటు కూడా నివేదికలు పంపడం జరిగింది.

- సి.రాము, ఆర్‌టిసి ఆర్‌ఎం, రాయచోటి.

ప్రశాంతంగా రీ పోలింగ్

- బహిష్కరించిన వైసిపి
- పటిష్టమైన పోలీసు బందోబస్తు
- నేడు ఓట్ల లెక్కింపు
- మధ్యాహ్నానికే ఫలితాలు వెల్లడి



కొత్తపల్లె పోలింగ్ కేంద్రం వద్ద బారులుదీరిన ఓటర్లు

ప్రజాశక్తి-పులివెందుల రూరల్

పులివెందుల జడ్‌పిటిసి ఉప ఎన్నికలకు మంగళవారం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలో కూటమి ప్రభుత్వం, పోలీసులు కుమ్మక్కై, ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు రానీయకుండా, బయట ప్రాంత వ్యక్తులు వచ్చి ఓట్లు వేశారని కడప ఎంపీ వై.ఎస్.అవినాష్‌రెడ్డి రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఎంపీ ఫిర్యాదు ఆధారంగా బుధవారం అచ్చువెల్లిలోని మూడో నెంబర్ పోలింగ్ బూతుకు, ఎర్రబల్లె కొత్తపల్లిలోని 14వ నెంబరు పోలింగ్ బూత్‌కు రీపోలింగ్ నిర్వహించాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఈ రెండు పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల అధికారులు రీ పోలింగ్ నిర్వహించారు. రీపోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరారు. రీ పోలింగ్ సందర్భంగా పోలీసులు పటిష్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఉప ఎన్నికల రీ పోలింగ్‌లో 58.24 శాతం నమోదైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటపతి తెలిపారు. పోలింగ్ నెంబర్ 3, 14 బూతులలో 1765 ఓట్లకు గాను 1028 ఓట్లు పోల్ అయ్యాయి. 3వ కేంద్రంలో 1273 గాను 691 ఓట్లు, 14వ పోలింగ్ బూతులు 492 గాను 337 ఓట్లు పోలయ్యాయి. బ్యాలెట్ బాక్స్‌లను ప్రత్యేక వాహనాల ద్వారా పోలీస్ బందోబస్తుతో కడపకు తరలించారు.



కొత్తపల్లె పోలింగ్ కేంద్రం వద్దకు వర్షంలోనూ చంటి బిడ్డతో ఓటు వేసేందుకు వస్తున్న మహిళ

నేడు ఓట్ల లెక్కింపు

పులివెందుల, ఒంటిమిట్ట జడ్‌పిటిసి స్థానాలకు మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉప ఎన్నికలను నిర్వహించింది. ఈ ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు గురువారం రిమ్స్ సమీపంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ నేషనల్ యూనివర్సిటీలో ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చేశారు. పులివెందుల జడ్‌పిటిసికి సంబంధించి 10 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఒకే రౌండులో పులివెందుల జడ్‌పిటిసి ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. ఒంటిమిట్ట జడ్‌పిటిసి స్థానానికి సంబంధించి పది టేబుళ్ల ఏర్పాటు చేశారు. రెండు రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. రెండు స్థానాల ఫలితాలు మధ్యాహ్నానికే వెలువడుతాయన్నారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా పటిష్టమైన బందోబస్తుతో పాటు, అన్ని ఏర్పాట్లను చేశారు. ఓట్ల లెక్కింపు ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమవుతుంది.



కడపలో కౌంటింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్

కౌంటింగ్‌కు పటిష్ట భద్రత : కలెక్టర్

కడప అర్బన్ : పటిష్టమైన భద్రతా బలగాల మధ్య కౌంటింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లను సంసిద్ధం చేశామని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. జడ్‌పిటిసి ఉప ఎన్నికలకు సంబంధించి బుధవారం సాయంత్రం కడప రిమ్స్ సమీపంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ నేషనల్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని జెసి అదితి సింగ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూముల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో పాటు, పోలింగ్ కేంద్రాల్లో పోలైన ఓట్లతో నిక్షిప్తమైన బ్యాలెట్ బాక్సులను అత్యంత సురక్షితంగా భద్రపరచామన్నారు. ఓట్ల లెక్కింపు సజావుగా, సౌకర్యవంతంగా జరిగేలా సెటప్ చేశామన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు, జడ్‌పి సిఇఒ ఓబులమ్మ, ఎఆర్‌ఒలు జాన్ ఇర్విన్, రంగస్వామి, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, డిఎస్‌పి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రీ పోలింగ్ ఒక డ్రామా : ఎంపీ

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

జడ్‌పిటిసి ఉప ఎన్నికల రీ పోలింగ్ ఒక డ్రామా అని, కోర్టును ఆశ్రయిస్తే చెప్పుకోవడానికి రీ పోలింగ్ రెండు బూతులలో పెట్టారని, 15 బూతుల్లో స్లిప్పులు లాక్కుని దొంగ ఓట్లు వేశారని, ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని ఎన్నికలు, రీ పోలింగ్‌ను బహిష్కరిస్తున్నామని కడప ఎంపీ వై.ఎస్.అవినాష్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 12వ తేదీ జరిగిన పులివెందుల జడ్‌పిటిసి ఎన్నికలు ఎలా జరిగాయో రాష్ట్రం మొత్తం చూశారని తెలిపారు. ఇతర నియోజకవర్గాల నుంచి వందలాది మంది టిడిపి వారు ఎలా బూతులు ఆక్రమించారో అందరికీ తెలుసన్నారు. బుధవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో కేవలం 2 బూతుల్లో మాత్రమే రీ పోలింగ్ ప్రకటించారని తెలిపారు. మేము స్పష్టంగా 15 బూతుల్లో రీపోలింగ్ జరగాలని, కేంద్ర బలగాలతో ఎన్నిక జరపాలని కోరామని పేర్కొన్నారు. రాత్రికి రాత్రి కేవలం రెండు బూతుల్లో రీ పోలింగ్ అంటున్నారని చెప్పారు. కోర్టును ఆశ్రయిస్తామని ఈ రీ పోలింగ్ డ్రామాను తెర మీదకు తెచ్చారన్నారు. రెండు బూతుల్లో జరుగుతున్న రీ పోలింగ్‌ను బహిష్కరించామన్నారు. గ్రామాల్లోకి వెళ్ళి ప్రజల్ని అడిగితే వాస్తవాలు బయటకు వస్తాయన్నారు.

జగన్‌కు భయం పట్టుకుంది : ఎమ్మెల్సీ

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిలో భయం పుట్టుకొచ్చిందని, ఆచరించి మాట్లాడితే బాగుంటుందని, ఏజెంట్లను కూడా పెట్టుకోలేని పరిస్థితి వైసిపిదని, గతంలో మీరు చేసింది గుర్తుతెచ్చుకోవాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ప్రశ్నించారు. బుధవారం తన నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. 2004 నుంచి 2009 మధ్యలో జరిగిన ఎన్నికలలో మీరు పులివెందుల నుంచి జమ్మలమడుగు, రాయచోటి, కడప నియోజకవర్గాలకు వెళ్లి చేసిన దౌర్జన్యాలు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. 2022లో జరిగిన శాసనమండలి పట్టభద్రుల ఎన్నికలలో లింగాల మండలంలో మా ఏజెంట్లను తీర్చడమే కాకుండా దౌర్జన్యం చేయలేదా అని ప్రశ్నించారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో నామినేషన్లు వేయకుండా ఏకగ్రీవాలు చేసుకున్న చరిత్ర మీదన్నారు. సమావేశంలో టిడిపి నాయకుడు బొజ్జ మైసూరారెడ్డి పాల్గొన్నారు.

బొప్పాయి ధరలపై ఫిర్యాదుకు హెల్ప్‌లైన్

- రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్.ఎస్.భావన

ప్రజాశక్తి-రాజంపేట

బొప్పాయి ధర తగ్గిపోయిందంటూ ప్రచారంలో ఉన్న తప్పుడు సమాచారాన్ని రైతులెవరూ నమ్మవద్దని, బొప్పాయిని కిలో రూ.9, రూ.10లకు కొనడానికి వ్యాపారస్తులు సిద్ధంగా ఉన్నారని రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్.ఎస్.భావన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బొప్పాయి ధర కిలో రూ.7లకు తగ్గిపోయిందంటూ కొంతమంది దళారులు ఇచ్చే తప్పుడు ఫిర్యాదులు సామాజిక మాధ్యమాలలో రావడం వల్ల రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ఇటువంటి తప్పుడు సమాచారాలను నమ్మవద్దని రైతులకు సూచించారు. ఇటువంటి తప్పుడు ఫిర్యాదులు రైతులు కాకుండా దళారులు లేదా ఇతరులు ఇవ్వడం వల్ల బొప్పాయిని తక్కువ ధరకు రైతుల దగ్గర నుండి కొనే విధంగా ట్రేడర్లు అవకాశాన్ని సృష్టించుకుంటున్నారని పేర్కొన్నారు. మంగళవారం సబ్ కలెక్టర్‌కు, రైల్వేకోడూరు తహశీల్దార్‌కు రైతుల దగ్గర నుండి బొప్పాయిని తక్కువ ధరకు కొంటున్నారంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సబ్ కలెక్టర్ విచారణ చేపట్టగా ఆ ఫిర్యాదులో నిజం లేదని తేలిందని పేర్కొన్నారు. ఇటువంటి తప్పుడు ఫిర్యాదులు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బొప్పాయి రైతులు తమ దగ్గర నుండి రూ.9 కంటే తక్కువ ధరకు కొంటున్న ట్రేడర్లపై ఫిర్యాదు ఇచ్చేందుకు నేరుగా సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నెంబర్లకు (9573990331, 9030315951) కానీ కార్యాలయంలో కానీ ఫిర్యాదులు ఇవ్వవచ్చన్నారు. రైతులు తమ ఫిర్యాదు నమోదు చేసేటప్పుడు ట్రేడర్ వివరాలు (ట్రేడర్ పేరు, ధర, వాహనం నెంబరు), తమ వివరాలను (రైతు పేరు, గ్రామం పేరు, సర్వే నెంబరు) తప్పనిసరిగా తెలియపరచాలని సబ్ కలెక్టర్ సూచించారు.

ఆధునిక బోధనా పద్ధతులు తప్పనిసరి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి: అంగన్వాడీ సెంటర్లలో ఇసిసి కార్యక్రమాల ద్వారా పిల్లలకు ఆధునిక బోధనా పద్ధతులు అనుసరించడం అత్యవసరమని కలెక్టర్ శ్రీధర్ చామకూరి స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి వివరించారు. బుధవారం అమరావతి సచివాలయం నుండి ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి అంగన్వాడీ సెంటర్లలో ఇసిసి సమర్థవంతమైన కార్యకలాపాలపై విసి నిర్వహించారు కలెక్టరేట్ విసి హాలు నుండి కలెక్టర్‌తో పాటు స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ హైమావతి పాల్గొన్నారు. ఈ సందర్భగా కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో ఇసిసి కార్యక లాపాలు పిల్లల మానసిక, శారీరక, భాషా, సామాజిక అభివృద్ధికి అత్యవసరమని, పిల్లలకు ఆధునిక బోధనా పద్ధతులు అనుసరించేలా చర్యలు తీసుకోవాల్సి వుందని వివరించారు. సాంకేతిక సదుపాయాలతో కూడిన ఇసిసి కార్యకలాపాలను చేసుకుంటే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చన్నారు. పిల్లల భవిష్యత్తుకు ఇది బలమైన పునాది అవుతుందన్నారు. కాజ్ అండ్ ఫేస్ లెర్నింగ్ పద్ధతులు పిల్లల అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించడంలో కీలకమని పేర్కొన్నారు. మారు తున్న తరానికి అనుగుణంగా ఆధారిత కార్యకలాపాలను దత్తత తీసుకుంటే అద్భు తమైన ఫలితాలు సాధించవచ్చని వివరించారు. జిల్లాలోని 11 ప్రాజెక్టుల పరిధిలోని 2,275 అంగన్వాడీ కేంద్రాల్లో 35,248 మంది పిల్లలకు పౌష్టికాహారం, ప్రాథమిక విద్య అందిస్తున్నామని వివరించారు. పిల్లలకు సూక్ష్మంగా చెప్పాల్సిన పాఠ్యాంశాలను ఎల్ఇడి స్క్రీన్ల ద్వారా వీడియో రూపంలో, ప్లే బేస్డ్ పద్ధతిలో అందించడం ద్వారా సమానమైన, సమర్థవంతమైన బోధన సాధ్యమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఫిజికల్ లెర్నింగ్‌కు పరిమితులు ఉంటాయని ఆధునిక సాంకేతిక పద్ధతులు ఉపయోగిస్తే అన్ని కేంద్రాల అంగన్వాడీ టీచర్లు ఒకే స్థాయిలో బోధించగలరన్నారు. ఇటీవల తాను తంబళ్లపల్లెలో అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి మూవబుల్ గ్రీన్ బోర్డులు ఏర్పాటు చేయడం వల్ల మంచి ఫలితాలు వచ్చాయని తెలిపారు. అలాగే అంగన్వాడీ కార్యకర్తల వద్ద ఉన్న పాత మొబైల్ ఫోన్లను అప్‌గ్రేడ్ చేసి, వీడియో కంటెంట్, ప్లేబ్యాక్ సదుపాయం కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రాథమిక శిక్షణతో పాటు పునఃశిక్షణా తరగతులు నిరంతరాయంగా కొనసాగిస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని వివరించారు. తల్లిదండ్రులతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించి, పిల్లల అభ్యాసనకు అనుకూల వాతావరణం సృష్టించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

'మిట్స్' వైస్ ఛాన్సలర్‌గా యువరాజ్

ప్రజాశక్తి-మదనపల్లె

మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీకి ప్రొఫెసర్ సి.యువరాజ్ యాక్టింగ్ వైస్ ఛాన్సలర్‌గా బుధవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేయగా, ఈ నియామకాన్ని విశ్వవిద్యాలయ ఛాన్సలర్, వ్యవస్థాపకుడు డాక్టర్ ఎన్.విజయ భాస్కర్‌చౌదరి ప్రకటించారు. విశ్వవిద్యాలయ ప్రోఛాన్సలర్ ఎన్.ద్వారకానాథ్ ఈ నియామక ఉత్తర్వును ప్రొఫెసర్ సి.యువరాజ్‌కు అధికారికంగా అందజేశారు. ఈ సంద ర్భంగా యువరాజ్ మాట్లాడుతూ, యాక్టింగ్ వైస్ ఛాన్సలర్ హోదాలో ప్రొఫెసర్ యువరాజ్ విశ్వవిద్యాలయం అభివృద్ధి దిశగా అవసరమైన విద్యా, పరిపాలనా, ఆర్థిక, పాలనా, ఇతర వ్యూహాత్మక అంశాలను పర్యవేక్షిస్తారని తెలిపారు.



నియామక పత్రాన్ని తీసుకుంటున్న యువరాజ్

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-వాల్మీకిపురం: సెప్టెంబర్ 13న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి గురు అరవింద్ అన్నారు. బుధవారం స్థానిక కోర్టు ఆవరణంలో న్యాయవాదులు, పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా అవగాహనలు కల్పించాలన్నారు. రాజీ కాదగిన కేసుల్లో కక్షిదారులకు అవగాహన కల్పించి, రాజీ అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు రవిప్ర కాష్, కార్యదర్శి ప్రసాద్, న్యాయవాదులు రమణారెడ్డి, ద్వారకనాథ రెడ్డి, ఆనంద కుమార్, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పక వాడాలి : సిఐ



మాట్లాడుతున్న సిఐ

ప్రజాశక్తి-వాల్మీకిపురం: జాగ్రత్తలతో మన ప్రాణాలను మనమే కాపాడుకుం దామని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వాల్మీకిపురం సిఐ రాఘవరెడ్డి సూచించారు. బుధవారం ఆయన వాల్మీకిపురంలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సిఐ ప్రసాద్ బాబు మన్నూరుకు బదిలీ కాగా జిల్లా ఆర్ఎస్‌టిఎఫ్‌లో సిఐగా ఉన్న రాఘవరెడ్డి వాల్మీకిపురంకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్టచర్యలు చేపడుతామన్నారు. మోటర్ సైకిల్, తదితర వాహనాలు నడిపే వారికి డ్రైవింగ్ లైసెన్సులు తప్పనిసరిగా ఉండాలన్నారు. చిన్న వయసులోనే వాహనాలను నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. మోటర్ సైకిల్‌పై వెళ్లే వారు హెల్మెట్‌ను కచ్చితంగా వాడాలని, వాహనాలకు రిజిస్ట్రేషన్లు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. కొంత మంది సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తూ.. ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. పరిమితికి మించిన వేగంగా వాహనాన్ని నడపకూడదని సూచించారు.

17న జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపికలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

వైఎస్ఆర్ కడప జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ (బాల బాలికలు), సీనియర్స్ (మెన్, ఉమెన్) ఎంపికలు ఈ నెల 17వ తేదీన రాజంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఎంపికలు నిర్వహిస్తామని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.కృష్ణమూర్తి, జి.వెంకట రమణ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. సబ్ జూనియర్స్ ఎంపికలకు సంబంధించి 02-01-2010 తరువాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. సబ్ జూనియర్స్, సీనియర్స్ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు, క్రీడాకారిణులు అందరూ ఈ నెల 29, 30, 31వ తేదీలలో ప్రకాశం జిల్లా చేవూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఎంపికలకు వచ్చే క్రీడాకారులు, క్రీడాకారిణులు అందరూ తప్పనిసరిగా పుట్టిన తేది కలిగిన ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, బ్లడ్ గ్రూప్, డ్రెస్ కోడ్, షూస్ తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 94901 81104, 7036907303 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులకు జిల్లా ఉపాధ్యక్షుడు బాబా ఫకృద్దీన్, జిల్లా సంయుక్త కార్యదర్శి ఇమామ్ బాషా ఉచిత భోజన వసతి కల్పిస్తారని తెలిపారు.

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత : కమిషనర్

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

ప్రజారోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ జి.రవి అధికారులను కోరారు. బుధవారం ఆయన పట్టణంలోని సచివాలయాల వార్డు అడ్మిన్ సెక్రటరీలు, ఇన్‌ఛార్జి అడ్మిన్ సెక్రటరీలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేలా సెక్రెటరీలు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం కావడంతో నిత్యం పారి శుధ్యం పనులు జరిగేలా చూడాలన్నారు. అన్ని ప్రాంతాలకు తాగునీరు సక్రమంగా సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడ తాగునీరు కలుషితం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజావసరాలను గుర్తించి తగువిధంగా వారికి సేవలు అందిం చాలన్నారు. సకాలంలో పన్నులను వసూలు చేయడం ద్వారా మున్సిపల్ అభివ ృద్ధికి పాటుపడాలాంటూ కోరారు. పలు రకాల పనుల కోసం సచివాలయాలకు విచ్చేసే ప్రజలను గౌరవించడంతో పాటు వారి పనులు సకాలంలో చేసి పెట్టాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించబోమంటూ ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో మేనేజర్ రవిరెడ్డి పాల్గొన్నారు.

వెలిగల్లు ఇంటేక్‌వెల్‌ను పరిశీలించిన కమిషనర్ : రాయచోటి పట్టణానికి ప్రధానంగా తాగునీరు అందించే వెలిగల్లు వాటర్ స్కీమ్‌ను కమిషనర్ రవి పరిశీలించారు. పట్టణానికి తాగునీరు పంపింగ్ సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. నిత్యం వాటర్ స్కీమ్ మోటర్లు పరిశీలిస్తూ అవసరమైతే తక్షణ మరమ్మతులు చేపట్టాలంటూ ఆదేశించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు వాటర్ ఇంజనీరింగ్ డిఇ చక్రవర్తి, ఎఇ కిరీటితో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



వెలిగల్లు వాటర్ స్కీం మోటార్లను పరిశీలిస్తున్న కమిషనర్ రవి



పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ఉత్సాహంగా తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలో బుధవారం మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. 79వ స్వాతంత్ర్య దినోత్సవ ముందస్తు వేడుకలు కనుల పండుగగా జరిగాయి. స్థానిక మిషన్ కాంపౌండ్‌కు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, కూటమి నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున చేరుకోగా పట్టణంలోని పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ వర్కర్స్, డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు, పట్టణ పుర ప్రజలు పెద్ద ఎత్తున చేరుకున్నారు. ప్రతి ఒక్కరి చేతిలో మువ్వన్నెల జెండాను చేత పట్టుకొని ముందస్తు వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలను స్మరిస్తూ, పట్టణం నలుమూలల వందేమాతరం గీతాలను వినిపిస్తూ గొప్ప ప్రదర్శన చేపట్టారు. మిషన్ కాంపౌండ్ నుంచి బయలుదేరిన ప్రదర్శన స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం మీదుగా చిత్తూరు బస్టాండ్, టౌన్ బ్యాంక్ సర్కిల్, బెంగళూరు బస్టాండ్, శ్రీకృష్ణదేవరాయల సర్కిల్ నుంచి ఆనిబి సెంట్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మదనపల్లిలో అనాదిగా వస్తున్న స్వాతంత్ర్య దినోత్సవ ముందస్తు వేడుకలను ఇంత ఘనంగా నిర్వహించిన విద్యార్థులకు, విద్యాసంస్థల ప్రతినిధులకు, డ్వాక్రా సంఘాల మహిళలకు, పట్టణ ప్రజలకు దన్యవాదాలు తెలిపారు. ప్రతి ఏడాది ఇదేవిధంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. జాతీయగీతం పుట్టిన మదనపల్లెలో ఇలాంటి వేడుకలకు వేదిక. అవ్వడం, వేడుకల్లో ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొంటూ మద్దతివ్వడం భావితరాలకు ఆదర్శంగా ఉందన్నారు.

రాజంపేట ఎంపిపిగా ఆరెళ్ల రమణమ్మ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట మండల పరిషత్ అధ్యక్షులుగా కూచివారిపల్లి-2 ఎంపిటిసిఆరెళ్ల రమణమ్మ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఎం.నరసింహమూర్తి ప్రకటించారు. రాజంపేట మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో బుధవారం ఈ ఎన్నికను నిర్వహించారు. ఆమెను ఆర్.బుడుగుంటపల్లె ఎంపిటిసి ఆకేపాటి రంగారెడ్డి, తాళ్లపాక ఎంపిటిసి డి.మధు సూధన వర్మ ప్రతిపాదించారు. ఈ సమావేశానికి 14 మంది ఎంపిటిసిలు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వరప్రసాద్ పాల్గొన్నారు.



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న సహకార బ్యాంక్ చైర్మన్ నల్లారి చంద్రారెడ్డి

జంగమ సోదరుల అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి-కలికిరి

జంగమ సంక్షేమ సంఘం అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తానని జంగమ సంక్షేమ సంఘం నూతన చైర్మన్‌గా ఎన్నికైన వాసునూరు చంద్రశేఖర్ తెలి పారు. బుధవారం ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంకు చైర్మన్ నల్లారి చంద్రకుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నల్లారి లక్ష్మీకర్‌రెడ్డిని ఆయన మర్యాద పూర్వకంగాకలిశారు. చంద్రశేఖర్‌ను నల్లారి సోదరులు శాలువ తో కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైర్మన్ పదవి ఇచ్చినం దుకు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డికి, నల్లారి చంద్ర కుమార్ రెడ్డికి, లక్ష్మీకర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జంగం సంక్షేమ సంఘం సోదరుల సమస్యలు పరిష్కరించడానికి నా వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్ర మంలో కె.వి.రెడ్డి, సుధాకర్ రెడ్డి, ఆనంద్ రెడ్డి, సల్లయ్య, వెంకటపతి, శ్రీనివాస్ వర్మ , చిన్న రెడ్డయ్య, కృష్ణయ్య, వెంకటాద్రి, రోజా పాల్గొన్నారు.

ప్రధాన కార్యదర్శిగా జెట్టి శామ్యూల్

ప్రజాశక్తి-కలికిరి

వైసిపి జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా జెట్టి శామ్యూల్ నియమి తుల య్యారు. ఈ నియామకాన్ని అధికారికంగా ప్రకటిస్తూ వైసిపి జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, పీలేరు నియోజకవర్గ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సంయుక్తంగా ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక అజయ్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామ, మండల, జిల్లా స్థాయి వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మండలంలో వైసిపి అభివృద్ధికి శామ్యూల్ ఎంతో కృషి చేశాడని దానికి తగ్గట్టుగానే పార్టీ గుర్తించి ఆయనకు క్రిస్టియన్ మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు చింతల రామ చంద్రారెడ్డి తెలిపారు. తన నియామకానికి సహకరించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డికి, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి, స్థానిక వైసిపి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని క్రిస్టియన్ మైనార్టీల అభివృద్ధి కోసం, ముఖ్యంగా పేద, వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ అధ్యక్షులు నల్లారి తిమ్మారెడ్డి, ఎపిఎండిసి రాష్ట్ర మాజీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు చింతల రమేష్‌రెడ్డి,ఎస్‌సి సెల్‌నాయకులు హరి శామ్యూల్‌కు అభినందనలు తెలిపారు.

వికసించిన బ్రహ్మ కమలాలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె



బ్రహ్మ కమలాలను చూపుతున్న అనిత

వికసించిన బ్రహ్మ కమలం నిమ్మనపల్లిలో పలువురిని ఆకర్షితులను చేసింది. మండల కేంద్రమైన నిమ్మన పల్లెకు చెందిన శాపరం సత్యనారాయణ శెట్టి, శాపరం అనిత దంపతుల ఇంటిలో బ్రహ్మ కమలం పువ్వులు వికసించాయి. సాధారణంగా సంవత్సరానికి ఒకటో రెండో కనిపించే ఈ బ్రహ్మ కమలం పువ్వులు సత్యనారాయణ దంపతుల ఇంటిలో ఏకంగా 30 పువ్వులు వికసించి ప్రజలను ఆశ్చర్యానికి గురి చేస్తూ కనువిందు చేశాయి. గత సంవత్సరం తమ ఇంటిలో 60 పువ్వులు వికసించాయని, ఈ సంవత్సరం 30 పువ్వులు వికసించినట్లు తెలిపారు. సత్యనారాయణ శెట్టి మాట్లాడుతూ.. బ్రహ్మ కమలం మొక్కను ఐదు సంవత్సరాల క్రితం బెంగళూరులోని తన బంధువుల ఇంటి నుంచి తీసుకువచ్చానన్నారు. సాధారణంగా బ్రహ్మ కమలం పువ్వులు ఏప్రిల్ నుంచి నవంబర్ నెల మధ్య వికసిస్తాయన్నారు. మొగ్గ వికసించే రోజున సాయంత్రం మొగ్గగా, రాత్రికి పువ్వుగా వికసించి, తెల్లవారితో సూర్యకిరణాలు రాగానే పువ్వులు వాడి పోతాయని అన్నారు.

పింఛా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల పరిధిలోని పింఛా డ్యాంకు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా ప్రాజెక్ట్‌కు నీరు వస్తోందని పింఛా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఇఇ బి. నాగేంద్రనాయక్, ఎస్ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఏం సమయం లోనైనా డ్యాం నిండే అవకాశం ఉన్నందున మండల పరిధిలోని ముడుంపాడు పేట, నగిరి, కురవపల్లి, తోగురుపల్లి, కమతంవారిపల్లి, పెదినేని కాలువ దళితవాడ, రాగిమానుబిడికి, చిన్నబిడికి, పెద్ద బిడికి, రాచపల్లి, రాయవరం, రెడ్డివారిపల్లి, బాలాజీ బిడికి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దిగువ ప్రాం తంలో ఎవరైనా ఈతకు వెళ్లేవారు, ఆవులు, మేకలు, గెదేలు ఉన్న వారు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

అనారోగ్యంతో మాజీ ఎంపిపి మృతి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలంలోని వైసిపి సీనియర్ నాయకులు, తవళం నేల్లమల్లేశ్వర స్వామి దేవస్థానం కమిటీ చైర్మన్‌గా పనిచేసిన మేష రామకృష్ణ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఆయన సన్నిహితులు తెలిపారు. టిడిపికి విధేయతగా, పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారని అన్నారు. 1994-99 మధ్య ఐదు సంవత్సరాలగా నిమ్మనపల్లి మండలానికి ఎంపిపిగాను, సుమారు 12 ఏళ్లకూ పైగా నేలమల్లేశ్వరస్వామి ఆలయం కమిటీ చైర్మన్ గాను విశేష సేవలందిం చారని పేర్కొన్నారు. ప్రస్తుతం నేలమల్లేశ్వర స్వామి ఆలయానికి తాత్కాలిక కమిటీ సభ్యులుగా వ్యవహరిస్తూ పునర్నిర్మాణాన్ని పూర్తి చేసుకున్న ఆలయ గర్భ గుడిని ఆగస్టు మొదటి వారంలో వైభవంగా ప్రారంభించారు. ఆలయం వద్ద ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేయించారు. రామకృష్ణ అకాల మరణం పార్టీకి తీరని లోటు అన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సనుభూతి తెలిపారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

గ్రామ సచివాలయ ఉద్యోగులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయరాదని స్పెషల్ ఆఫీసర్ అమర్నాథ్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం గోపిదిన్నె గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ఉద్యోగుల పనితీరు తదితర అంశాలపై ఆరా తీశారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం గోపిదిన్నెన లేఅవుట్ కాలనీ సందర్శించారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్లను త్వరగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ప్రభుత్వం అదనంగా ఇచ్చిన ఎస్‌సి, బిసిలకు రూ.50 వేలు, ఎస్‌టిలకు రూ. 75వేలు సద్వినియోగం చేసుకొని ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపిడిఒ థామస్, హౌసింగ్ ఎఇ సుజాత, ఇంజినీరింగ్ అసిస్టెంట్ హిమబిందు పాల్గొన్నారు.

శాంతి భద్రతలపై నిఘా : సిఐ



మాట్లాడుతున్న సిఐ లక్ష్మన్న

ప్రజాశక్తి-కలకడ : శాంతి భద్రతలపై గట్టి నిఘా ఉంచినట్లు నూతనంగా కలకడ సిఐగా బాధ్యతలు చేపట్టిన బి.లక్ష్మన్న తెలిపారు. గతంలో మొలకలచెరువు సిఐగా విధులు నిర్వహించి బదిలీపై కలకడ సర్కిల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలపై గట్టి నిఘా ఉంచి వాటిని కాపాడేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు చోరీలు, నాటుసారా తయారీ, అమ్మకాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. ట్రాఫిక్ నియమాలను పాటించేలా ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.

దుర్గంధ భరితంగా పెద్ద చెరువుకట్ట

ప్రజాశక్తి-గాలివీడు



పెద్దచెరువుకట్టపై ఉన్న వ్యర్థాలు

మండలంలోని గోరాన్ చెరువు పంచాయతీ గేటు నాలుగురోడ్ల కూడలి వద్ద పెద్దచెరువు కట్ట చెత్తాచెదారం, వ్యర్థాలతో నిండి దుర్వాసన వెదజల్లుతోంది. మండలంలోని కుమ్మరపల్లి, బుట్టిగా రిపల్లి, ఈతోటివారిపల్లి, అరవీడు, ఎల్లంపల్లితో పాటు పెద్దమండెం, గుర్రంకొండ, మదనపల్లికి వెళ్లే వాహనాలు ఈదారి మీదుగానే వెళ్ళాలి.ఆ దారిన వెళ్లాలంటే ముక్కు మూసుకొని వెళ్ళాల్సిందేనని ప్రయా ణికులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక కూడలి హోటళ్లు, చికెన్ సెంటర్లు, కూర గాయలు దుకాణాదారులు మిగిలిన వ్యర్థాలతో పెద్దచెరువు కట్టపై వేసి వెళుతున్నారని స్థానిక ప్రజలు చెబు తున్నారు. పాడైపోయిన, కుళ్ళిపోయిన పదార్థాలు, మాంసహార వ్యర్థాలను తెచ్చి కట్టపై వేస్తుండటంతో దుర్వాసనను భరించలేకపోతున్నామని అన్నారు. అక్కడ ఉన్న పరిశ్రుభతతో దోమలు విజృం భిస్తు న్నాయని, అసలే వానాకాలం కావడంతో విష జ్వరాల బారిన పడుతున్నామని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు దృష్టికి పెద్దచెరువు కట్టపైన పారి శుధ్య చర్యలు చేపట్టి,మళ్లీ ఎవరూ అక్కడ వ్యర్థాలను వేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలకు సత్వర న్యాయం చేయాలి



రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కల్యాణి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఇటీవల మదనపల్లి నూతన సబ్ కలెక్టరుగా బాధ్యతలు స్వీకరిం చిన చల్లా కల్యాణి బుధవారం బి.కొత్తకోట,పెద్దతిప్పసముద్రం మండలాల్లో సుడిగాలి పర్యటన చేశారు. రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రజలకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని , పిజిఆర్ఎస్‌లను వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మండలంలో పెండింగులో ఉన్న 19 వేల కులగణనను సుమోటోగా పరిష్కరించి ఆన్‌లైన్‌లో పొందుపరచాలని అధికారులకు సూచించారు. రీసర్వే ప్రక్రియను సమస్యలకు తావు లేకుండా పారదర్శకంగా నిర్వహించి త్వతరగతిన పూర్తిచేయాలన్నారు.అన్నదాత సుఖీభవ పథకం ద్వారా కొందరు రైతులకు నిధులు జమ కాలేదని పెండింగ్‌లో ఉన్న రైతులకు ఆధార్ సిడింగ్ చేసి వారి సమస్యలను పరిష్కరించాలని చెప్పారు.బి.కొత్తకోట తహసిల్దార్ కార్యా లయంలో వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ భావజాన్, డిటి.బాలాజీ ,మండల సర్వేయర్ ముబారక్,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని బుధ వారం రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్ఎస్.భావన తనిఖీ చేశారు. పలువురు రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాటా డుతూ రైతు సమస్యలపై ప్రత్యేక దృష్టికి సారించి వారి సమస్యలను పరిష్క రించాలని అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, పిజిఆర్ఎస్ అర్జీలను తగిన సమయం లోపల పరిష్కరించాలని తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపరాదని ఆదేశించారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. అనంతరం స్థానిక ప్రజా పరిషత్ సభ భవనాన్ని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ పుల్లారెడ్డి, ఆర్ఐ రాజశేఖర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల వసతి గృహంలో ఎంపిడిఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - బి.కొత్తకోట

మండలంలోని ఆదర్శ బాలికల పాఠశాల వసతి గృహాన్ని మండల ఎంపిడిఒ కృష్ణవేణి తనిఖీ చేశారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులు ఎంపిడిఒను శానిటరీ నెప్ కిన్స్ మిషన్ అడగగా వెంటనే స్పందించి ప్రిన్సిపల్ శ్రీనివాసులు నాయక్, వార్డెన్ రెడ్డి లక్ష్మికి,ఎంఇఒ రెడ్డిశేఖర్ చేతుల మీదుగా అందించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత కలిగి ఉండాలని సూచించారు. హాస్టల్లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకవస్తే ఉన్నతాధికారులతో నివేదికలు పంపి పరిష్కరిస్తామని చెప్పారు. చదువును నిర్లక్ష్యం చేయకుండా ఇష్టంతో కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.

నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి పెద్దపీట

ప్రజాశక్తి - బి.కొత్తకోట

నాయీ బ్రాహ్మణులకి 200 యూనిట్లు ఉచిత కరెంటు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తూ కూటమి ప్రభుత్వానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌కు టిడిపి రాష్ట్ర నాయి బ్రాహ్మణ సాధికారక సమితి నాయకులు మంగళ ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం పట్టణంలో నాయి బ్రాహ్మణ సంఘం నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ టిడిపి ప్రతి పక్షంలో ఉన్నప్పుడు బార్బర్ షాపులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తానని మాట ఇచ్చిన కూటమి ప్రభుత్వం, మాట నిలబెట్టుకుందని అన్నారు.నాయి బ్రాహ్మణ సోదరులకు కనీస వేతనం 20 వేల నుండి 25 వేల వరకు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని తెలిపారు. కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సమితి తంబళ్లపల్లి నియోజకవర్గం అధ్యక్షుడు బి.హరిచంద్ర ప్రసాద్, మండల అధ్యక్షుడు జె.మల్లికార్జున, కార్యదర్శి బి.గణేష్,ఉపాధ్యక్షుడు ఎస్.రమేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

ప్రజాశక్తి -నందలూరు

ప్రతి పౌరుడు తన ఇంటి పై భాగంలో జాతీయ జెండాను ఆవిష్కరించి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు మండలంలోని నందలూరు గ్రామ పంచాయతీ కార్యాల యంలో బుధవారం హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జవాన్ దారా రత్నమయ్యను ఎంపిడిఒ రాధాకృష్ణన్ , డిప్యూటీ ఎంపిడిఒ సునీల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, టిడిపి నాయకులు మోడపో తుల రాము శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమం ద్వారా ప్రజల్లో దేశభక్తి భావనను మరింతగా పెంపొందించడంతోపాటు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల నుస్మరించుకోవాలి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాలనీ వాసులకు దారి సౌకర్యం

- మానవత్వం చాటుకున్న రహంతుల్లా

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రహంతుల్లా తన సొంత నిధులతో పట్టణంలోని మోడల్ కాలనీ నుంచి నాగిరెడ్డి కాలనీకి దారి సౌకర్యం కల్పించి తన మానవత్వం చాటుకున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా దారి సౌకర్యం లేక స్థానికులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన ఎంఎంసి డైరెక్టర్ బుధవారం జెసిబి సాయంతో ద్విచక్ర వాహనాలు, పాదచారుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తగిన మార్గాన్ని నిర్మించారు. దివంగత ఎన్‌టి.రామారావు అధికారంలో ఉండగా పట్టణానికి చెందిన అర్హులైన పేదలకు పక్కా ఇళ్ళతో మోడల్ కాలనీ నిర్మించి ఇచ్చింది. రోజురో జుకు విస్తరిస్తున్న పీలేరు పట్టణంలోని నాగిరెడ్డి కాలనీ, మోడల్ కాలనీ మధ్య తగిన దారి లేక స్థానికులు రైల్వే ట్రాక్ క్రింది నుంచి ఉన్న చిన్నపాటి దారిలో కాలనీవాసులు రాకపోకలు సాగించేవారు. ప్రస్తుతం ఏర్పడిన మార్గంతో ద్విచక్ర వాహనాలు, ప్రజలకు దారి సౌకర్యం సమకూరింది.నాగిరెడ్డి కాలనీ, మోడల్ కాలనీ వాసులు రహంతుల్లాకు కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఉన్నతాధికారులు దారి సమస్యపై స్పందిస్తూ శాశ్వత పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రహంతుల్లా, రఘు, లోకేశ్వరి, మణి, కాలనీవాసులు పాల్గొన్నారు.

'శ్రీసాయి'లో కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్ అంశాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ కార్పొరేట్ ట్రైనర్ జావిద్‌ఖాన్ ప్రధాన రిసోర్స్ పర్సన్‌గా హాజరయ్యారు.ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రధానమైన ప్రపంచంలో ప్రతి విద్యార్థి తన జీవిత లక్ష్యం స్పష్టంగా నిర్ణయించుకోవాలని సూచించారు. ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి అంకితభావం, కృషి, పట్టుదల, ధనాత్మక ఆలోచన, ఒత్తిడిని జయించే నైపుణ్యం అవసరమని పేర్కొన్నారు. మంచి నడవడికతో, సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ముందడుగు వేస్తే ఎవరైనా తమ కలలను సాకారం చేసుకోవచ్చని తెలిపారు. టైమ్ మేనేజ్మెంట్, కమ్యూనికేషన్ స్కిల్స్ ఉద్యోగ అన్వేషణలో కీలక పాత్ర పోషిస్తాయని, భావవ్యక్తీకరణ నైపుణ్యం ద్వారా విషయాన్ని ఎదురుగా ఉన్న వారికి సంక్షిప్తంగా, స్పష్టంగా వివరించగలగడం విజయానికి మార్గం చూపుతుందని చెప్పారు. కార్య క్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి వెంకటరమణ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి-పీలేరు

వాతావరణంలో ఏర్పడే మార్పుల ప్రభావంతో చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారిణి డాక్టర్ శ్రీగిరీష తెలిపారు. బుధవారం పీలేరు మండలం, గూడరేవుపల్లిలో జరిగిన ఫ్యామిలీ ఫిజియన్ కార్యక్రమం జరిగింది. అధిక వర్షాలు-పిల్లల ఆరోగ్యం అనే అంశంపై తల్లిదండ్రులకు అవగాహన, పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ అధిక వర్షాలవల్ల ప్రతికూల వాతావరణ మార్పులు చోటుచేసుకుని పిల్లల్లో జ్వరం, దగ్గు, గొంతునొప్పి, విరేచనాలు వంటి సమస్యలు ఏర్పడే అవకాశం ఉందని, తక్షణం వైద్యుల సలహాలు, సూచనలు పొందాలని సూచించారు. పిల్లలకు తల్లి పాలు, కాచి చల్లార్చిన నీరు, తాజా పౌష్టికాహారం అందివ్వాలని, చేతులు శుభ్రత, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, వెచ్చటి వాతావరణం, జబ్బు చేసిన వ్యక్తుల నుండి దూరంగా ఉంచడం, సూచించిన సమయానికి వ్యాధినిరోధక టీకాలు, విటమిన్ ఎ ద్రావణం ఇప్పించడం చేయాలని తెలిపారు. కార్యక్ర మంలో ఎఎన్ఎంలు ప్రమీల, కృష్ణమ్మ, సిహెచ్ఒ లావణ్య పాల్గొన్నారు.

వెలుగు ఆశ్రమ వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని వెలుగు వృద్ధాశ్రమంలోని ఓ వృద్ధ మహిళ బుధవారం బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. వెలుగు సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా వృద్ధాశ్రమానికి చెందిన షేక్ షకినాబీ (75)కి బ్రెయిన్ స్ట్రోకు రావడంతో చికిత్స అందించినా పరిస్థితి విషమించడంతో మృతి చెందిందన్నారు. వృద్ధురలి మృతదేహానికి ఆశ్రమ కన్వీనర్ భాగ్యలక్ష్మి, సోషల్ వర్కర్ గీత, వృద్ధులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతదేహాన్ని కుమారుడు ఇమామ్‌కు అప్పగించారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి కలికిరి

సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని కలికిరి సిఐ అనిల్‌కుమార్ తెలిపారు. బుధవారం పట్టణంలోని శ్రీనివాస జూనియర్, డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలు, డ్రగ్స్ పైన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకి దేశంలో టెక్నాలజీ పెరుగుతుండడంతో వాటితో పాటే సైబర్ నేరాలు కూడా ఎక్కువగా పెరుగుతున్నాయని అన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్లు చేయడం ద్వారా, మనీ లోన్ యాప్ ద్వారా సైబర్ నేరగాళ్లు మోసా లకు పాల్పడుతున్నారని అన్నారు. కొంతమంది యువతను దృష్టిలో పెట్టుకొని మత్తు పదార్థాలు, డ్రగ్స్ వంటివి అలవాటు చేసి వేల కోట్ల రూపాయలు వ్యాపారం చేసి భవిష్యత్తును అంధకారం లోకి పెడు తున్నారని చెప్పారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీని వాస డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి, అధ్యాపక బృందం, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.**చిన్నమండెం** : మండల కేంద్రంలోని స్థానిక ఆదర్శ పాఠశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆదర్శ పాఠశాలను రాయచోటి సిఐ వరప్రసాద్, ఎస్ఐ సుధాకర్ సందర్శించి విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా పాఠశాలకు వచ్చే విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకూడదని, చిన్న వయసులో మత్తు పదార్థాలకు వ్యసనాలకు గురికాకుండా భవిష్యత్తు బంగారుమయం చేసుకోవాలన్నారు. ఫేస్‌బుక్, ఇన్స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా అపరిచిత వ్యక్తులను నమ్మి జీవితాన్ని కష్టాల మయం చేసుకోకూడదని హితవు పలికారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో- ఆర్డినేటర్ సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.7.52 కోట్లతో రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని చిన్నఓరంపాడు నుంచి పెద్ద ఓరంపాడు మీదుగా కాకర్లవారిపల్లి వరకు రూ.7.52 కోట్లతో తారు రోడ్డు నిర్మాణ పనులను బుధవారం కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, ఆయన తనయుడు సాయివికాస్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా కుడా చైర్మన్ మాట్లాడుతూ ఈ రహదారి నిర్మాణం వల్ల గ్రామాల మధ్య రవాణా సౌకర్యం మెరుగు అవుతుందని పల్లె ప్రజలకు సులభమైన రాకపోకలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వీటితో పాటుగా మరిన్నీ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకురావడానికి కృషి చేస్తామని భరోసా కల్పించారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ముక్కా రూపానందరెడ్డి



మార్కెట్ కమిటీ సభ్యులతో కలిసి బాధ్యతలు చేపట్టిన వరలక్ష్మి

ఎఎంసి చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన వరలక్ష్మి

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

రైల్వే కోడూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పగడాల వరలక్ష్మి బుధవారం తన ఛాంబర్‌లో కమిటీ సభ్యులతో కలిసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తనకు ఇచ్చిన మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పదవి ద్వారా రైతులకు అవసర మైన అన్ని సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని అన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతతో ఈ పదవిని నిర్వహిస్తానని, వ్యవసాయం మార్కెట్ కమిటీ ద్వారా వచ్చే నిధుల తో రైతులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో రైతుల పొలాల నుంచి ప్రధాన రహదారులకు అనుసంధానించే లింక్ రోడ్లు వేసేందుకు తగిన చర్యలు తీసుకు ంటామని అన్నారు. కార్యక్రమంలో చైర్మన్ భర్త పగడాల చంద్రశేఖర్, వైస్ చైర్మన్ శివయ్య, మార్కెట్ కమిటీ ఇన్చార్జి కార్యదర్శి లక్ష్మీకాంత్ బాబు, సూపర్వైజర్లు విద్యావతి, ఖదీర్ భాష, డిఇఒ భారతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.



డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న ఎపిఎం ఖాదర్‌వలి

డ్వాక్రా సంఘాలు నిధిని పెంచుకోవాలి

ప్రజాశక్తి-వీరబల్లి

స్వయం సహాయక సంఘాలు సంఘ నిధి పెంచుకోవాలని వెలుగు ఎపిఎం ఖాదర్‌వలి పేర్కొన్నారు. బుధవారం ఈడిగపల్లి పీర్ల చావిడిలో గ్రామ సమాఖ్య కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలు పొదుపు నిధులను సభ్యుల అవసరాలకు అంతర్గత రుణాలుగా తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లిం చడం వల్ల వచ్చే వడ్డీ, నెలకు పొదుపులు రూ.200 నుండి రూ.500 వందల వరకు పెంచుకొని సంఘ నిధిని పెంచుకోవచ్చు అన్నారు. దీనివల్ల సభ్యుల అవస రాలు తీరుతాయని, రుణాలు ఇచ్చే సంస్థల ద్వారా అధిక మొత్తంలో రుణాలు పొందవచ్చు అన్నారు. గ్రామ సమాఖ్యలో ప్రతి సంవత్సరం పొదుపులు, సభ్య త్వం, వాటాధనం చెల్లించడం వల్ల సమాఖ్య ద్వారా రుణాలు పొందవ చన్నారు. సంఘాలు పొందే ఏ రుణాలైన బయోమెట్రిక్ విధానం ద్వారానే తీసుకో వాలన్నారు. ప్రకృతి వ్యవసాయ అధికారి ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి రైతు పురుగు మందులు లేని వ్యవసాయం చేసి ఆరోగ్యకరమైన ఆహార పంటలను పండించాలన్నారు. ప్రతి కుటుంబంలో పెరటితోటల పెంపకం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిసినాగేంద్ర, విఒఎ తులసి, సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి - బి.కొత్తకోట



రక్తదానం చేస్తున్న మొగిలి

యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ సభ్యులు బి.మొగిలి 41వ సారి రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నాడు.బుధవారం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఓ గర్భిణీకి రక్తం అవసరం కాగా మొగిలి రక్తదానం చేసి ప్రాణదాతగా మారాడు.ఈ సంద ర్భంగా యంగ్ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తగాది రాజశేఖర్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్నారు. తమ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలను విస్తృతం చేయడం జరిగిందన్నారు .అన్ని రకాల సేవా కార్యక్రమాలలో తమ సంస్థ ముందు వరుసలో నిలుస్తోందని చెప్పారు. మా ఫౌండేషన్ సభ్యులు అందిస్తున్న సహాయ,సహకారాలు మరువలేని వన్నారు. మున్ముందు సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.41వ సారి రక్తదానం చేసి ఫౌండేషన్ కీర్తి ప్రతిష్టలు పెంచిన మొగిలిని ప్రత్యేకంగా అభినందించారు.

క్రైం కార్నర్

వరకట్నం మృతి కేసులో ముద్దాయికి పదేళ్లు జైలు శిక్ష

ప్రజాశక్తి - నందలూరు

వరకట్నం మృతి కేసులో ముద్దాయి పామూరు సాయి వర్ధన్‌కు రాజంపేట మూడవ అదనపు జడ్జి కోర్టు పది సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. నందలూరు టౌను బ్రాహ్మణవీధికి చెందిన పామూరి సాయివర్ధన్ తన భార్య అయిన పామూరి లక్ష్మీ ప్రసన్న (22)ను అదనపు కట్నం కోసం వేధించడంతో భర్త వేధింపులు తాళలేక 2023, మార్చి 29న తన చున్నీతో ఉరి వేసుకుని మృతి చెందిందని తెలిపారు. మృతురాలి తండ్రి రావూరు కనకరత్న ఆచారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు, అప్పటి నందలూరు ఎస్ఐ జె.వి.సుబ్బరాయుడు కేసు నమోదు చేశారన్నారు. అప్పటి రాజంపేట డిఎస్‌పి జి.శివభాస్కర్‌రెడ్డి, మరో డిఎస్‌పి వి.ఎన్.కె.చైతన్య సాక్షులను విచారించి, సాక్షాదారాలను సేకరించి, దర్యాప్తు చేసి సమగ్ర నివేదికను కోర్టుకు సమర్పించారని తెలిపారు.అన్నారు. ఆ నివేదిక ప్రకారం రాజంపేట 3వ ఎడిజె కోర్టు విచారణ జరిపి ముద్దాయికి శిక్ష విధించినట్లు తెలిపారు.

రెండు లారీలు ఢీ : ఇద్దరు డ్రైవర్లకు గాయాలు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు డ్రైవర్లు గాయప డ్డారు. ఈ సంఘటన తాలూకా సిఐ కళా వెంకటరమణ కథనం మేరకు.. కుప్పం, ఒడ్డిపల్లికి చెందిన డ్రైవర్ నారాయణస్వామి టెంపోలో మదనపల్లె టమో టా మార్కెట్‌కు బయలుదేరాడు. హైదరాబాదుకు చెందిన వెంకటదుర్గా రావు లారీలో పలమనేరుకు బయలుదేరాడు. మార్గమధ్యంలోని 150 మైలు వద్ద రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు లారీ ల్లోని డ్రైవర్లు గాయపడ్డారు. స్థానికులు బాధితులను 108 లో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బాధితులను ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. తాలూకా పోలీసులు విచారిస్తున్నారు.

గర్భిణి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కట్టుకున్న భర్త బాగోగులు పట్టించుకోక పోవడంతో గర్భిని ఆత్మహ త్యా యత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం పిటియం మండలంలో జరిగిం ది. బాధితురాలి కథనం మేరకు.. పిటిఎం మండలం, టి. సదుంకు చెందిన శ్రీకాంత్, పావని దంపతులకు ఏడేళ్ల కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం పావని ఏడు నెలల గర్భిణి. భర్త గత కొంతకాలంగా తనను, బిడ్డను పట్టించు కోకపో వడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన స్థానికులు బాదితురాలిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పిటియం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.